# సాక్షి తిరుపతి

గురువారం । 16 । ఫిబ్రవరి । 2023






తిరుపతి బులియన్

| | |
|---|---|
| బంగారం : | |
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.58.220 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.5.200 |
| వెండి: | |
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.67.400 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.69.40 |

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| తిరుపతి | 33 | 18 |
| చిత్తూరు | 34 | 16 |
| తిరుమల | 29 | 13 |
| గూడూరు | 34 | 19 |
| నగరి | 34 | 17 |

## రూ.250 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి



రాష్ట్రంలో పేద పిల్లల ప్రాణాలు కాపాడడానికి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో రూ.250 కోట్లతో నిర్మిస్తున్న చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొస్తామని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ...8లో

## న్యూస్‌రీల్

### నిత్యాన్నదానానికి రూ.5.49 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న ఈశ్వరయ్య

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పట్టణానికి చెందిన వేలూరు ఈశ్వరయ్య, మునిలక్ష్మి దంపతులు తమ కుమారుడు భవనచంద్ పేరు మీద బుధవారం రూ.5.49 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చి, స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### రోజూ 6 వేల మందికి అన్నదానం



అన్నదాన మండపంలో భోజనం చేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయానికి ఎక్కువమంది భక్తులు వస్తున్నారు. దీంతో ఆలయ అధికారులు స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులందరికీ అన్నదానం చేస్తున్నారు. సోమవారం నుంచి శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. సాధారణ రోజుల్లో 2000 మంది, శనివారం, ఆదివారం, సోమవారాల్లో 4 వేల మందికిపైగా అన్నదానసత్రంలో భోజనం చేస్తుంటారు. శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని 13 రోజుల పాటు 6 వేల మందికి అన్నదానం చేస్తున్నారు. అలాగే కళాకారులకు, పోలీసు సిబ్బంది, ఇతర అధికారుల కోసం ప్రత్యేకంగా టూరిస్ట్ బస్టాండ్ ప్రాంతంలోని శివసదన్‌లో 3 వేల మందికి భోజనం అందజేస్తున్నారు. అలాగే 18వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా 10 వేల మందికి పైగా అన్నదానం చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 నుంచి భక్తులకు అన్నదానం ప్రారంభించేలా దేవస్థానం అధికారులు నిర్ణయించారు. అంతేగాకుండా కల్యాణోత్సవం, రథోత్సవాల సందర్భంగా ఎక్కువమంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వారికి కూడా భోజనం సదుపాయం కల్పించనున్నట్లు అన్నదానం ఇన్‌చార్జ్‌గా కె.వి.రమణ తెలిపారు.

**భక్తులకు నాణ్యతమైన భోజనం..**

మామూలు రోజుల్లోనే నాణ్యమైన భోజనం అందిస్తాం. ప్రస్తుతం 6 వేల మందికి భోజనం అందిస్తున్నాం. శివరాత్రి రోజు 10 వేల మందికి దాతల సహకారంతో నాణ్యమైన భో జనం అందజేస్తాం. అలాగే నంద్యాలకు చెంది న ప్రసాద్ అనే భక్తుడు 15 ఏళ్లుగా శివరాత్రికి కూరగాయలు అందజేస్తారు. ఈ ఏడాది కూడా 50 టన్నుల కూరగాయలు అందజేశారు.

– కె.వి.రమణ, అన్నదానం ఇన్‌చార్జ్

అలల ప్రయాణం సంద్రం తీరం వరకే.. కానీ గంగపుత్రుల ప్రయాణం మాత్రం కడలి అంతరాల వరకు.. వారి ప్రాణాలు సముద్ర కెరటాల మాటున దాగి ఉంటాయి. పట్టెడన్నం కోసం సూర్యోదయానికి ముందే ఎగిసిపడే కెరటాలను చీల్చుకుంటూ సముద్రంలోకి వెళ్తారు.. మత్స్యకారుల జీవితాలు సంద్రం మధ్యన తరంగాల్లాంటివే.. వేటకు వెళ్లాక ఎంతటి విపత్కర పరిస్థితులు ఎదురైనా తట్టుకునే శక్తి వారికే సొంతం.. ఏళ్ల తరబడి ఆచారాలు, కట్టుబాట్లను పాటిస్తారు.. కష్టమొచ్చినా.. నష్టమొచ్చినా..సమంగా పాలు పంచుకుంటారు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు వారి తలుపు తట్టాయి. వారి పిల్లలు సైతం విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. దీంతో అనునిత్యం జీవన్మరణ సమస్యతో పోరాడే మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నిండాయి.

# కడలి అలలపై జీవన నావ



నడి సముద్రంలో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులు

- సూర్యోదయానికి ముందే తీరం కెరటాలను చీల్చుకుంటూ కడలిలోకి వేటకు వెళ్తున్న గంగపుత్రులు
- సముద్రంలో చేపల వేటే వారి జీవనాధారం
- ఎంతటి విపత్కర పరిస్థితులనైనా తట్టుకునే శక్తి వీరి సొంతం
- నేటికీ గ్రామ కట్టుబాట్లను పాటిస్తున్న మత్స్యకారులు
- వీరి జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్సార్‌సీపీ సర్కారు
- సంక్షేమ పథకాలు, ప్రభుత్వ ప్రోత్సాహంతో మారిన జీవన ప్రమాణాలు

వాకాడు: అనునిత్యం కడలి అలలకు ఎదురేగి జీవన పోరాటం చేస్తారు మత్స్యకారులు.. కుటుంబపోషణ కోసం ప్రాణాలు పణంగా పెట్టి నిద్ర లేచింది మొదలు వేట సామగ్రితో సముద్రంలోకి వెళ్లిపోతారు. సముద్రంలో చేపలు పట్టి వాటిని అమ్మగా వచ్చిన సొమ్ముతో కుటుంబాలను పోషించుకుంటారు. అవసరమైనంత సంపద దొరికే వరకు ఎన్నిరోజులైనా సముద్రంలోనే వేట సాగిస్తారు. సముద్రంలో ఎంతటి విపత్కర పరిస్థితులను అయినా సరే ఎదురొడ్డి నిలబడే ధైర్యం వీరికి ఎక్కువ. గత పాలకులు మత్స్యకారులను గాలికొదిలేశారు.

### వారి జీవితాల్లో ఎన్నో మార్పులు

2014 నుంచి 2018 వరకు ఓవైపు మర పడవల దాడులు, మరోవైపు ప్రకృతి వైపరీత్యాలు, ఇంకోవైపు సాయం చేయకుండా హామీలను గాలికొదిలి ముఖం చాటేసిన అప్పటి పాలకులు.. వెరసి గంగపుత్రుల ఇక్కట్లు వర్ణనాతీతంగా ఉండేవి. అయితే సంప్రదాయ మత్స్యకారుల ఆకలి ఘోషను దగ్గరగా చూసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గడిచిన మూడన్నరేళ్లలోనే విప్లవాత్మక మార్పులతో గంగపుత్రుల జీవితాల్లో అభివృద్ధి వెలుగులు నింపింది. వారి గుమ్మం వద్దకే సంక్షేమ పథకాలు చేరడంతో వారి జీవన నావ ఇప్పుడు సరైన దిశగా పయనిస్తోంది. ముఖ్యంగా మత్స్యకార భరోసా(వేట విరామం)ను రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచడం, మత్స్యకార ప్రమాద బీమా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడం, డీజిల్ సబ్సిడీ రూ.3 నుంచి రూ.9కు పెంచడం, 50 ఏళ్లకే మత్స్యకారులకు ప్రభుత్వ పింఛన్ అందిస్తుండడంతో వారి జీవనశైలిలో సమూలమైన మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఈసారి కేంద్రప్రభుత్వం కూడా సముద్రంలో కేజ్ కల్చర్ చేసుకోవడానికి మత్స్యకారులకు ఒక్కో యూనిట్‌కి రూ.5 లక్షలు, చేపలు అమ్ముకోవడానికి మోటార్ సైకిల్, ఐస్‌బాక్స్ రూ.75 వేలు, మూడు చక్రాల వాహనాల కొనుగోలుకు రూ.3 లక్షలు, కొత్త బోటు, నెట్ కొనుగోళ్ల కోసం రూ.5 లక్షలు, 60–40 శాతం సబ్సిడీతో పథకాలు అందజేయడంతో మత్స్యకారుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి.

### జిల్లాలో మత్స్యకారుల సంఖ్య..

జిల్లాలోని 5 తీర ప్రాంత మండలాల్లో 75 కిలోమీటర్లు పొడవునా సముద్ర తీరం విస్తరించి ఉంది. అందులో వాకాడు, కోట, చిల్లకూరు, తడ, సూళ్లూరుపేట మండలాలు ఉన్నాయి. అలాగే 42 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. అందులో 70 వేల మంది మత్స్యకార జనాభా ఉన్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులు 12 వేల మంది ఉన్నారు. వీరికి 1022 బోట్లు ఉన్నాయి. 31 ఫిష్ ల్యాండ్స్ ఉన్నాయి. అలాగే సముద్రపు ముఖద్వారాలు మూడు చోట్ల ఉన్నాయి. అందులో కొన్ని ముఖద్వారాలు ఇసుక మేటలతో పూర్తిగా కప్పేయడంతో మత్స్యకారుల వేట గత మూడు నెలలుగా పూర్తిగా ఆగిపోయింది. మత్స్యకార గ్రామాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉండేది. ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం విద్యకు పెద్దపీట వేయడంతో వారి పిల్లలు విద్యాప్రగతి పథంలో పయనిస్తున్నారు. మత్స్యకారుల ప్రగతి కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు వీరి తలరాతలను పూర్తిగా మార్చేశాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.



సముద్రంలో వేటాడి బోటులో తెచ్చిన చేపలను పరిశీలిస్తున్న మత్స్యకారులు

### వేటకు వెళ్లే ముందు..

అర్ధరాత్రి ఒంటి గంట తరువాత భార్యాబిడ్డలను పలకరించి మత్స్యకారులు సంద్రం ఒడ్డుకు చేరుతారు. ముందుగా మత్స్యసంపద దొరికే ప్రదేశం, వెళ్లాల్సిన దిశలపై చర్చించుకుంటారు. వేటకు బయలుదేరే ముందు తమ ఇష్ట దైవాన్ని తలుచుకుని కడలిలోకి ప్రవేశిస్తారు. సాధారణ వల వేటకు ముగ్గురు, రింగు వల వేటకు ఏడుగురు, వంజిరం వల వేటకు 10 మంది మత్స్యకారులు వేటకు బయలుదేరుతారు. బయలుదేరిన బోట్లు సుమారు 5 కి.మీ నుంచి 16 కి.మీ వరకు సముద్రం లోపలికి వెళ్తాయి. వీరు తెచ్చిన చేపలను మత్స్యకారులంతా సమానంగా పంచుకుని, మహిళలు గంపల్లో తీసుకుని సమీప గ్రామాల్లో తిరిగి అమ్ముకుంటారు. ఒకవేళ చేపలు అధిక మోతాదులో దొరికితే వాటిని కేరళ, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలకు చెందిన దళారీలకు వేలంపాట ద్వారా విక్రయిస్తారు. ఒకవేళ వేట సజావుగా సాగకపోతే ఆ నష్టాన్ని కూడా సమానంగా భరిస్తారు. ప్రస్తుతం ప్రకృతి విపత్తుల కారణంగా సముద్ర జలాలు కలుషితమై మత్స్య సంపద కాస్త తగ్గింది. ఒక్కోసారి రోజుల తరబడి ప్రాణాలను పణంగా పెట్టి వేటాడినా తగినన్ని చేపలు దొరక్క వారికి పూట గడవని పరిస్థితులు కూడా ఎదురవుతాయి.

### కట్టుబాట్లతో సమస్యల పరిష్కారం..

మత్స్యకార గ్రామాల్లో తరతరాల నుంచి గ్రామ కట్టుబాట్లను మత్స్యకారులు నేటికీ పాటిస్తుండడం విశేషం. వీరంతా ఒకే మాట, ఒకే బాట అన్న చందంగా ముందుకు సాగుతారు. ప్రతి గ్రామంలోనూ పెద్ద కాపు, నడిపి కాపు, చిన్న కాపు అలా ముగ్గురు గ్రామ కాపులు ఉంటారు. గ్రామంలో ఎవరైనా గ్రామ కట్టుబాట్లను దిక్కరిస్తే వారికి తగిన జరిమానా విధిస్తారు.

### చాలా భయమేసింది..



2014లో వచ్చిన అతి భయంకరమైన హుద్ హుద్ తుపాన్ సమయంలో ఐదుగురు సముద్రంలో వేటకు వెళ్లి 45 కిలో మీటర్ల దూరంలో చిక్కుకుపోయాం. ఆ సమయంలో మా బోటు ఒకచోట నిలబడడం లేదు. విపరీతమైన సుడిగుండాలు తిరుగుతుండడంతో ఇష్ట దైవంపై భారమేసి బోటును ఓ చోట లంగర్ వేశాం. ఒడ్డుకు చేరేందుకు సాగర కెరటాలతో ఎదురీదాల్సిన క్లిష్టమైన పరిస్థితి. అతికష్టమ్మీద రాత్రి అంతా సముద్రంలో ఈదుతూ మృత్యుంజయుడిలా దరికి చేరుకున్నాం.

– శ్రీనివాసులు మత్స్యకారుడు, అంజలాపురం

### బతికి బయటకు వస్తామనుకోలేదు..



2017లో తన ఆరుగురు సముద్రంలో వేటకు వెళ్లగా నాగూరు నాగపట్నంకు చెందిన కొందరు మత్స్యకారులు స్పీడు బోటుతో మా బోటును ఢీకొట్టడంతో ముక్కలైంది. సముద్రంలో పడిపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న మేము భయాందోళన చెందాం. ఇంటికి చేరుతానా.. ఇంతేనా.. అనుకున్నాం.. ధైర్యంతో కాపాడాలని రెడ్ కలర్ బోటు ముక్క పైకెత్తి ఆర్తనాదాలు పెట్టాము. దేవుడే మమ్మల్ని కాపాడడానికి వచ్చినట్లు అనిపించింది. అటుగా వేటకు వెళ్తున్న చెన్నై మత్స్యకారులు మమ్మల్ని రక్షించారు. దీంతో ఆరుగురు బతికాం.

–మునస్వామి, మత్స్యకారుడు లైట్‌హౌస్



సముద్రంలో చేపల వేటకు వెళుతున్న మత్స్యకారులు

### మేమే పరిష్కరించుకుంటాం..



మా మత్స్యకార గ్రామంలో ఏ తప్పులు జరిగినా వాటిని వీలైనంత వరకు పోలీసుల చెంతకు చేరకుండా మేమే సామరస్యంగా పరిష్కరించుకుంటాం. మేమంతా ఒకే మాటకు కట్టుబడి ఉంటాం. తప్పు చేసిన వారికి గ్రామ కట్టుబాటు ప్రకారం ఇంకోసారి తప్పు జరగకుండా జరిమానా విధించి మందలిస్తాం. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను కలసికట్టుగా పోరాడి సాధించుకుంటాం.

– అప్పంగారి మహేంద్ర, పెద్దకాపు, తూపిలిపాళెం

### పథకాలను సద్వినియోగం చేసుకోవాలి..



గ్రామ కట్టుబాట్లతో ముందుకు సాగుతున్న మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతోంది. వాటిని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే జిల్లాలో మత్స్యకారులకు అన్ని రకాల పథకాలు అందుతున్నాయి. పీఎం మత్స్యసంపద పథకం ద్వారా కూడా మత్స్యకారులకు లాభం చేకూరుతోంది.

– చాంద్‌బాషా, ఫిషరీస్ ఏడీ గూడూరు




బోటును సముద్రం నుంచి ఒడ్డుకు లాగుతున్న మత్స్యకారులు

# భూతవాహనంపై భైరవుడు





సూర్యప్రభ-చప్పరంపై స్వామి, అమ్మవారు ఊరేగింపు



భూతవాహనంపై స్వామి, అమ్మవారు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్)/శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు బుధవారం రాత్రి ముక్కంటీశుడు భూతవాహనంపై,అమ్మవారు చిలుక వాహనంపై దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు అలంకార మండపంలో ప్రత్యేక పూజలు చేపట్టి, ప్రత్యేక పూలతో అలంకరించారు. అనంతరం కళాకారుల ఆటపాటలు, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఉభయదారులు ముందు నడవగా స్వామి, అమ్మవార్లను నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూల నీరాజనాలతో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు, ఈఓ కేవీ సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

**భూతనాథుడిగా నీలకంఠుడు..**

భూతనాథుడైన శ్రీకాళహస్తీశ్వరుడు రాత్రివేళ భూతవాహనంపై, అమ్మవారు శుక (చిలుక) వాహనంపై అభయప్రదానం చేశారు. రాజగోపురం గుండా తేరువీధిలోకి స్వామి, అమ్మవారు ప్రవేశించారు. ఈ సందర్భంగా శివనామస్మరణలతో, భక్తుల ఢమరుక నాదాలతో మాడవీధులు మార్మోగాయి. విద్యుత్‌దీపాల వెలుగులు, కళాకారుల ఆటపాటలతో స్వామి, అమ్మవారి ఊరేగింపు ఉత్సవాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. అంతకుముందు ఉదయం సూర్యప్రభపై కైలాసనాథుడు, చప్పరంపై నుంచి జ్ఞానప్రసునాంబ అమ్మవారు భక్తులను కటాక్షించారు. నేడు గాంధర్వరాత్రి సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లు హంస, యాళి, రాత్రి రావణుడు, మయూర వాహనాలపై ఊరేగనున్నారు.

## శిల్పకళాశాలలో కౌంటర్

తిరుపతి అలిపిరి: టీటీడీ శిల్ప కళాశాల విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల విగ్రహాలతో పాటు, సంప్రదాయ, కలంకారి చిత్రాలను విక్రయించడానికి కళాశాల ఆవరణలో కౌంటర్ ఏర్పాటు చేస్తామని చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. కళాశాల ఆవరణలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిల్ప కళా ప్రదర్శనను బుధవారం ఆయన సందర్శించారు. కళాశాల విద్యార్థులు తయారు చేసిన శిల్పాలను చూసి వారి నైపుణ్యాన్ని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిల్పకళను ప్రోత్సహించడానికి టీటీడీ అనేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్ సమయంలో వారి పేరిట రూ.లక్ష డిపాజిట్ చేసి కోర్సు పూర్తయ్యాక వడ్డీతో సహా అందిస్తున్నామని తెలిపారు. కళాశాలలో రెండేళ్ల కలంకారీ కోర్సులో చేరే విద్యార్థులకు కూడా రూ.లక్ష డిపాజిట్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కళాశాల విద్యార్థుల నైపుణ్యాన్ని ప్రపంచానికి తెలియజేయడానికి కృషి చేస్తున్న జేఈఓ సదాభార్గవిని చైర్మన్ అభినందించారు. టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు మల్లీశ్వరి, డీఈఓ భాస్కర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ వెంకట రెడ్డి పాల్గొన్నారు.



శిల్పకళా ప్రదర్శనలు పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్

## నిబంధనల మేరకే నామినేషన్లు

సాక్షి, చిత్తూరు : ఎమ్మెల్సీ అభ్యర్థులు నిబంధనల మేరకే నామినేషన్ దాఖలు చేయాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. చిత్తూరు కలెక్టరేట్‌లో నామినేషన్లు దాఖలు చేసేందుకు వీలుగా సర్వం సిద్ధం చేశారు.

**23 వరకు నామినేషన్ల స్వీకరణ**

నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుంచే నామినేషన్ దాఖలు చేయవచ్చని బుధవారం కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. 16 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ దాఖలు చేయాలని సూచించారు. 24వ తేదీన నామినేషన్ల పరిశీలన, 27 వరకు ఉపసంహరణకు అవకాశం కల్పించినట్లు వివరించారు.

# ‘ఎస్పీఎల్’ విజేత తిరుపతి

- జూనియర్ విభాగంలో ఇడుపులపాయ జట్టు
- అట్టహాసంగా ముగిసిన సాక్షి ప్రీమియర్ లీగ్ రీజనల్ స్థాయి క్రికెట్ పోటీలు

**అనంతపురం సప్తగిరి సర్కిల్ :** ‘సాక్షి ప్రీమియర్ లీగ్’ రీజనల్ స్థాయి సీనియర్ విభాగం క్రికెట్ పోటీల విజేతగా తిరుపతి సీకాం జట్టు, జూనియర్స్ విభాగంలో వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ జట్టు నిలిచాయి. ‘సాక్షి’ మీడియా గ్రూపు ఆధ్వర్యంలో అనంత క్రీడాగ్రామం వేదికగా రెండు రోజుల పాటు సాగిన ఎస్పీఎల్ రీజనల్ స్థాయి పోటీలు ఆద్యంతం ఉత్కంఠగా సాగాయి. బుధవారం ఆర్డీటీ ప్రధాన స్టేడియంలో నిర్వహించిన ఫైనల్స్‌లో సీనియర్ విభాగంలో సీకాం జట్టు (తిరుపతి) ఎస్కేఎస్సీ డిగ్రీ కళాశాల జట్టు (ప్రొద్దుటూరు), జూనియర్ విభాగంలో ట్రిపుల్ ఐటీ (వైఎస్సార్), సీకాం జూనియర్ కళాశాల (తిరుపతి) జట్లు తలపడ్డాయి.

**ధరణి మెరుపు బ్యాటింగ్**


• సీనియర్ విభాగం ఫైనల్స్‌లో సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి) జట్టుపై ఎస్కేఎస్సీ డిగ్రీ కళాశాల (ప్రొద్దుటూరు - వైఎస్సార్ జిల్లా) జట్టు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 79 పరుగులకు పరిమితమైంది. జట్టులో విజయ్ 25 బంతుల్లో 2 ఫోర్లతో 30 పరుగులు, మరో బ్యాటర్ శివకేశవ 16 బంతుల్లో 1 సిక్సర్‌తో 20 పరుగులు సాధించారు. సీకాం బౌలర్లలో శశాంక్ 2, సుబ్బు 1 వికెట్ పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్ చేసిన సీకాం జట్టు 7.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సునాయసంగా ఛేదించింది. ధరణి మెరుపు బ్యాటింగ్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. మొత్తం 23 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 52 పరుగులు సాధించాడు. ఎస్కేఎస్సీ బౌలర్లలో వెంకటేష్ 1 వికెట్ దక్కించుకున్నాడు. 8 వికెట్ల తేడాతో తిరుపతి సీకాం జట్టు విజయ కేతనం ఎగురవేసి, త్వరలో విజయవాడ వేదికగా సాగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది.

**రీజనల్ స్థాయి మ్యాచ్‌లో చెలరేగిన ట్రిపుల్ ఐటీ**

• అనంత క్రీడాగ్రామంలోని హాకీ మైదానం వేదికగా బుధవారం ఉదయం నిర్వహించిన జూనియర్స్ విభాగం రీజనల్ మ్యాచ్‌లో ట్రిపుల్ ఐటీ (ఇడుపులపాయ - వైఎస్సార్ జిల్లా), ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఆత్మకూరు - అనంతపురం జిల్లా) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి ఆత్మకూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇడుపులపాయ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 141 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. జట్టులో చేతన్ 23 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 60 పరుగులు, రాంబాబు 25 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 48 పరుగులు సాధించారు. ఆత్మకూరు బౌలర్లలో మనోజ్, జయ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆత్మకూరు జట్టు 9.4 ఓవర్ల వద్ద 60 పరుగులకే కుప్పకూలింది. జట్టులో వెంకట్ ఒంటరి పోరు సాగిస్తూ 12 బంతుల్లో 6 ఫోర్లతో 25 పరుగులు సాధించాడు. ఇడుపులపాయ బౌలర్లలో ప్రకాష్, హర్ష, చరణ్ చెరో 2 వికెట్లు కూలదోశారు. 81 పరుగులతో ఇడుపులపాయ జట్టు భారీ విజయాన్ని నమోదు చేసి ఫైనల్‌కు చేరుకుంది.

**ఉత్కంఠ రేపిన ‘జూనియర్స్’**

• ఆర్డీటీ ప్రధాన క్రీడామైదానంలో నిర్వహించిన జూనియర్ విభాగం ఫైనల్స్‌లో సీకాం జూనియర్ కళాశాల (తిరుపతి) జట్టుపై టాస్ గెలిచి ట్రిపుల్ ఐటీ (ఇడుపులపాయ - వైఎస్సార్ జిల్లా) జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసింది. జట్టులో ప్రకాష్ 12 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 34 పరుగులు, మరో బ్యాటర్ రాంబాబు 25 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 26 పరుగులు సాధించారు. తిరుపతి బౌలర్లలో గౌతం 3, ముఖేష్ 2 వికెట్లు కూలదోశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన తిరుపతి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. చివరి ఆరు బంతుల్లో 20 పరుగులు సాధించాల్సి ఉండగా క్రీజ్‌లో హర్ష, బాలాజీ ఉన్నారు. తొలి బంతిని బ్యాటర్ బౌండరీ దాటించడంతో ట్రిపుల్ ఐటీ క్రీడాకారులు ఒత్తిడికి లోనయ్యారు. ఈ క్రమంలో రెండో బంతిని బౌలర్ డాట్ చేశాడు. మూడో బంతిని బ్యాటర్ సిక్సర్ బాదడంతో తిరిగి ఉత్కంఠ నెలకొంది. ఇక మిగిలిన మూడు బంతుల్లో పది పరుగులు సాధించాల్సి ఉండడంతో ఇరు జట్ల క్రీడాకారులతో పాటు చూస్తున్నప్రేక్షకులు సైతం ఊపిరిబిగబట్టారు. నాలుగో బంతిని బౌలర్ వైడ్ వేయడంతో తిరుపతి క్రీడాకారుల్లో ఆశలు చిగురించాయి. ఐదో బంతికి బ్యాటర్ సింగిల్ రన్ చేశాడు. మిగిలిన చివరి రెండు బంతుల్లో ఎనిమిది పరుగులు సాధించాల్సి ఉంది. ఆరో బంతిని బ్యాటర్ సిక్సర్ బాదడంతో ఒక్కసారిగా తిరుపతి క్రీడాకారులు కేరింతలు కొట్టారు. విజయం తమదేనన్న ధీమా అందరిలోనూ వ్యక్తమైంది. అయితే ట్రిపుల్ ఐటీ బౌలర్ ఏడో బంతిని చాకచక్యంగా డాట్ చేయడంతో ఊహించని విధంగా విజయం ట్రిపుల్ ఐటీ వశమైంది. ఒక్క పరుగు తేడాతో విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది.


సీనియర్ విభాగంలో విన్నర్స్ తిరుపతి సీకాం డిగ్రీ కళాశాల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న జేఎన్‌టీయూ వీసీ

**ఓటమి గెలుపునకు తొలిమెట్టు**

ఏ క్రీడలోనైనా ఓటమి అనేది తర్వాత సాధించే గెలుపునకు తొలి మెట్టుగా ఉపయోగపడుతుందని జేఎన్‌టీయూ (ఏ) వీసీ జింక రంగజనార్దన అన్నారు. ఎస్పీఎల్ రీజనల్ స్థాయి పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై, మాట్లాడారు. గెలుపు ఆనందాన్ని అందిస్తే ఓటమి భవిష్యత్తుపై ఆశలు రేపుతుందన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ చక్కటి అవకాశాన్ని ఇచ్చిన ‘సాక్షి’ మీడియా గ్రూపును అభినందించారు. రైపర్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఓటమి గెలుపునకు నాంది అవుతుందని, ఎన్నో సవాళ్లను ఎదుర్కొనేందుకు తొలి మెట్టుగా దోహదపడుతుందని అన్నారు. రాయలసీమ స్థాయి టోర్నీ నిర్వహణకు సహకరించిన ఆర్డీటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ‘సాక్షి’ అనంతపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, ఏడీవీటీ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు, ఈవెంట్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


జూనియర్ విభాగంలో విన్నర్స్ ట్రిపుల్ ఐటీ జట్టు


సీనియర్ విభాగంలో రన్నర్స్ ఎస్ఆర్ఎస్సీ డిగ్రీ కళాశాల జట్టు


జూనియర్ విభాగంలో రన్నర్స్ తిరుపతి సీకాం జూనియర్ కళాశాల జట్టు



## ఆక్వా అభివృద్ధికి కృషి చేయండి

– ఆక్వా జోన్ ఏర్పాటుకు కమిటీ ఆమోదం

**తిరుపతి అర్బన్:** జిల్లాలో ఆక్వా అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆక్వా జోన్ కమిటీ సమావేశంలో ఆక్వాజోన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన మేరకు తిరుపతి జిల్లాకు సముద్రతీరం వచ్చిందన్నారు. తీరప్రాంతంలో ఆక్వా సాగు ఉందని గుర్తు చేశారు. ఆక్వా రైతులను జోన్ పరిధిలోకి తీసుకురావాలని చెప్పారు. ఏ భూముల్లో ఆక్వా సాగు చేస్తున్నారు ? ఆ భూములు సక్రమంగా ఉన్నాయా ? లేదా అనేవాటిపై పూర్తి వివరాలతో సమాచారం సేకరించాలని చెప్పారు. ఆక్వా అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న విద్యుత్ రాయితీలతో పాటు దాణా తదితర అంశాలపై చర్చించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి చాంద్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా చిట్టమూరు, చిల్లకూరు, వాకాడు, కోట మండలాల్లో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ నిబంధనల మేరకు సర్వే చేశామని తెలిపారు. ఈ మండలాల్లో ఆక్వా సాగు 2019 నాటికి 2381.67 హెక్టార్లు ఉండగా, రీసర్వేలో 27 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి అదనంగా 782.39 హెక్టార్లు ఆక్వా సాగులో ఉందని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఆక్వాకమిటీ సభ్యులు జ్ఞానవేల్, అరవిక్కరసు, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.


ఆక్వాజోన్ ఏర్పాటుపై చర్చిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

## నేడు ఎమ్మెల్యే శివదీక్ష స్వీకరణ

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి శివదీక్ష స్వీకరించనున్నారు. భక్తులు ఉదయం 6 గంటలకు ఆలయ పరిసరాల్లోని త్రినేత్ర అతిథిగృహం వద్దకు చేరుకోవాలని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆంధ్రజ్యోతిపై పరువు నష్టం దావా మార్చి 15కు వాయిదా

**తిరుపతి లీగల్:** ఆంధ్రజ్యోతి పత్రికపై టీటీడీ దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువు నష్టం దావాను తిరుపతి పదవ అదనపు జిల్లా జడ్జి కోర్ట్ ఇన్‌చార్జి న్యాయమూర్తి, స్థానిక ఐదవ అదనపు జిల్లా జడ్జి అన్వర్‌బాషా మార్చి 15కి వాయిదా వేశారు. బుధవారం టీటీడీ ఇదివరలో దాఖలు చేసిన 2 పిటిషన్లపై ఆంధ్రజ్యోతి తరపు న్యాయవాది కౌంటర్లు దాఖలు చేశారు. ఆ పిటిషన్లపై వాదనలు వినడానికి న్యాయమూర్తి కేసును వాయిదా వేశారు. ఈ కేసును టీటీడీ తరపున రాజ్యసభ ఎంపీ సుబ్రమణ్యస్వామి వాదిస్తున్నారు.

## రూ.250 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

- వీలైనంత త్వరగా చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొస్తాం
- గుండె మార్పిడి చేయించుకున్న విశ్వేశ్వర్‌కు టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పరామర్శ


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

**తిరుపతి తుడా :** రాష్ట్రంలో పేద పిల్లల ప్రాణాలు కాపాడడానికి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో రూ.250 కోట్లతో నిర్మిస్తున్న చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొస్తామని టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ఈ ఆస్పత్రిలో అవయవ మార్పిడికి అవసరమైన అన్ని సదుపాయాలతో పాటు హెలిపాడ్ కూడా నిర్మిస్తామని తెలిపారు. శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో జనవరి 20వ తేదీ రాష్ట్రంలోనే తొలి చిన్న పిల్లల గుండె మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే. బుధవారం సాయంత్రం టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి జేఈఓ సదాభార్గవితో కలసి ఆస్పత్రిలో గుండెమార్పిడి చేసుకున్న విశ్వేశ్వర్‌ను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా 2021 అక్టోబర్ 11వ తేదీన శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాలన్ని ప్రారంభించామన్నారు. ఇక్కడ కేవలం 15 నెలల కాలంలోనే 1,110 మంది చిన్న పిల్లలకు గుండె శస్త్రచికిత్సలు ఉచితంగా చేసినట్లు సుబ్బారెడ్డి చెప్పారు. గుండె మార్పిడి చికిత్సను విజయవంతం అయ్యేలా కృషి చేసిన అందరినీ ఆయన అభినందించారు. కార్యక్రమంలో బర్డ్ ఆస్పత్రి ప్రత్యేకాధికారి డాక్టర్ రెడ్డెప్ప రెడ్డి, చిన్నపిల్లల గుండె ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ భరత్, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.



## వ్యాన్ డ్రైవర్, మూడు ఆవులు మృతి


చెట్టును ఢీకొన్న బొలేరో లగేజీ వాహనం, షేక్‌బాషా మృతదేహం

**ఏర్పేడు:** మండలంలోని గోపాలపురం వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్, మూడు ఆవులు మృతిచెందినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు.. మండలంలోని పల్లంపేట నుంచి షేక్‌బాషా అనే వ్యక్తి బొలేరో లగేజీ వాహనంలో మూడు ఆవులను ఎక్కించుకుని మంగళవారం అర్ధరాత్రి పుంగనూరుకు బయలుదేరాడు. గోపాలపురం వద్దకు రాగానే వ్యానుకు కట్టిన తాడు ఊడిపోవడంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి కట్టుకుంటుండగా, అదే సమయంలో మాచర్ల నుంచి తిరుపతికి అతివేగంతో వెళ్తున్న ఓ లారీ ఈ వాహనాన్ని ఢీకొనడంతో డ్రైవర్ షేక్ బాషా(38) పాటు మూడు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. లగేజీ వాహనం రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొని ముందుభాగం నుజ్జునుజ్జయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బైక్ బోల్తా: వ్యక్తి మృతి


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ కృష్ణారెడ్డి

**పెళ్లకూరు:** మోటారు బైక్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాలు.. ఊడిపూడి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు(30) నాయుడుపేట సమీపంలోని ఓ పరిశ్రమలో పని ముగించుకుని తిరిగి మోటారుబైక్‌లో ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో బంగారంపేట గ్రామ సమీపంలోని ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో వెంకటేశ్వర్లు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ కృష్ణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య అంకమ్మ, కుమార్తెలు బిందుశ్రీ, పూజిత ఉన్నారు.

## లారీ క్లీనర్ మృతి


లారీలోనే మృతి చెందిన క్లీనర్ బాలసుబ్రహ్మణ్యమన్

**చిల్లకూరు:** విజయవాడ వైపు లోడుతో వెళ్తున్న ఓ లారీ క్లీనర్ భోజనం అనంతరం మృతి చెందిన సంఘటన చిల్లకూరు మండలం జాతీయ రహదారిపై రైటార్ సత్రం సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ ఉత్తరస్వామి, క్లీనర్ బాలసుబ్రహ్మణ్యమన్(50) లోడుతో విజయవాడవైపు బయలు దేరారు. ఈ క్రమంలో మధ్యాహ్న సయమం కావడంతో డ్రైవర్, క్లీనర్ ఒకరి తరువాత ఒకరు డ్రైవింగ్ చేస్తూ భోజనం ముగించుకున్నారు. ఈ క్రమంలో లారీ రైటార్‌సత్రం సమీపంలోకి రాగానే క్లీనర్ బాలసుబ్రహ్మణ్యమన్ వాంతులు చేసుకున్నాడు. డ్రైవర్ లారీని పక్కన నిలిపి అతన్ని కిందకు దించే ప్రయత్నం చేయగా అంతలోనే మృతి చెందాడు. 108కి సమాచారం ఇవ్వగా, వారు వచ్చి పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సంఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య పిల్లలు ఉన్నట్లు తెలిసింది.